తల్లికి వందనం ఇవ్వాలి



ఎన్నికల సమయంలో టీడీపీ-జనసేన నాయకులు తల్లికి వందనం సాయం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేలు ఇస్తామన్నారు. అది మేమంతా నమ్మాం. నాకు ఇద్దరు పిల్లలకు ఈ ఏడాది రూ.30 వేలు రావాల్సి ఉంది. కానీ తల్లికి వందనం ఈ ఏడాది ఇవ్వబోమని చెబుతున్నారు. ఇచ్చిన మాట తప్పకుండా ఈ ఏడాది నుంచే తల్లికి వందనం పథకం అమలు చేయాలి.

– ఎం.ప్రియాంక, పెదగాడి, పెందుర్తి

పెట్టుబడి సాయం ఏదీ?



గత ప్రభుత్వంలో ఏటా తొలకరికి ముందే రైతులకు పెట్టుబడి సాయం కింద డబ్బులు ఇచ్చేవారు. ఈ ఏడాది ఖరీఫ్ నాట్లు కూడా పూర్తయ్యాయి. కానీ రైతులకు ఎలాంటి సాయం అందలేదు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు సాయం అందిస్తే మాకుఎంతో మేలు జరుగుతుంది. తక్షణమే పెట్టుబడి సాయం అందేలా ప్రభుత్వం చూడాలి.

– కుంచె త్రినాథమ్మ, చింతగట్ల, పెందుర్తి

హామీలపై సందేహం



ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఎన్నో హామీలిచ్చారు. కింది స్థాయి కార్యకర్తలు కూడా ఏకరువుపెట్టారు. వారి మాటలు నమ్మి ఓట్లేశాం. అసెంబ్లీ లో సీఎం చంద్రబాబు సూపర్-6 హామీలపై చేసిన వాఖ్యలు చూస్తే వారిచ్చిన హామీల అమలుపై సందేహం కలుగుతోంది. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇచ్చిన హామీలపై మాట నిలబెట్టుకుంటారని ఆశిస్తున్నాం.

– ఎం.ఎ రమణ, సింహాచలం

గతంలో మాదిరి చేయరుగా!



అనుకోని కారణాల వల్ల ఇంటర్‌తో చదువు ఆపేశాను. నా చదువుకు తగ్గ ఉద్యోగం వస్తుందని చాన్నాళ్లుగా ప్రయత్నం చేస్తున్నాను. కానీ రాలేదు. ఉద్యోగం ఇవ్వకపోతే రూ.3 వేలు భృతి ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. దాన్ని త్వరగా అమలు చేస్తారని ఆశిస్తున్నాను. 2014లో చంద్రబాబు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ఇవ్వలేదు. ఇప్పుడు అలా జరగదనుకుంటున్నాను.

– యర్ర ఉదయ్‌కిరణ్, పెందుర్తి

వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లాలా?



ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నాట్లు కూడా వేసేశాం. ఇప్పటికే పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సి వచ్చింది. గతంలో ఈపాటికే ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందించేది. కానీ కొత్త ప్రభుత్వం ఇప్పటివరకు అన్నదాత సుఖీభవ పథకంలో అందించే సాయంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. తక్షణమే మాకు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించాలి.

– పిల్లల స్వామినాయుడు, రాయపురఅగ్రహారం


నిరుద్యోగ భృతి ఎప్పటి నుంచి?



నేను ఎంఏ జర్నలిజం కోర్సు పూర్తి చేశాను. ప్రస్తుతం ఇంటి దగ్గరే ఉండి ప్రభుత్వ ఉద్యోగం కోసం సన్నద్ధమవుతున్నాను. ఎన్నికల సందర్భంగా కూటమి సూపర్ సిక్స్ హామీల్లో నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చి 100 రోజులైనా పట్టించుకోవడం లేదు. ఉద్యోగాలు కల్పించాలి. లేకుంటే నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇవ్వాల్సిందే. లేకపోతే నిరుద్యోగుల నుంచి ప్రతిఘటన తప్పదు.

–బండారు కిరణ్ కుమార్, గొటివాడ కాలనీ

బాబు షూ్యరిటీ.. మోసం గ్యారెంటీ



నమ్మి ఓట్లు వేశాం.. నట్టేట ముంచొద్దు బాబూ.. హామీలు అమలు చేయండి

నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు.. నీకు.. నీకు... ఇంటిలో ఎందరు పిల్లలు చదివితే అందరికీ తల్లికి వందనం పేరుతో రూ.15 వేలు చొప్పున అందిస్తాం. మీ అమ్మకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు బ్యాంకు ఖాతాలో వేసేస్తాం. మీ ఇంటికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చేస్తాం. మీ ఇంటిలోని మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం. మీ ఇంటిలో నిరుద్యోగులుంటే ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగభృతి చెల్లిస్తాం. రైతులందరికీ అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి రూ.20 వేలు చొప్పున అందిస్తాం. అధికారంలోకి రాగానే ఈ సూపర్ సిక్స్ పథకాలన్నీ పక్కాగా అమలు చేసేస్తాం.. అంటూ ఎన్నికల సమయంలో ఇంటింటికీ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు వెళ్లి ప్రచారంలో ఉదరగొట్టారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌తోసహా స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు మాయా మేనిఫెస్టోను ప్రజలకు చూపించి ఓట్లు అభ్యర్థించారు. ఆ హామీలన్నీ నమ్మిన జనం ఓట్లేసి అధికారం కట్టబెట్టేసరికి.. పథకాల అమలుకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదని చేతులెత్తేశారు. అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటింది. ఖరీఫ్ సీజన్ గడుస్తున్నా పెట్టుబడి సాయం కోసం అన్నదాతలు.. స్కూళ్లు తెరిచి మూడు నెలలు దాటడంతో రూ.15 వేల సాయం కోసం తల్లులు ఆశగా ఎదురు చూస్తున్నా... అందించే దిక్కే లేదు. గత ఐదేళ్లలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీలన్నీ పక్కాగా అమలు చేశారని... ఆర్థికంగా అండగా నిలిచారని లబ్ధిదారులు గుర్తు చేసుకుంటున్నారు. చంద్రబాబు మాత్రం అందుకు పూర్తి భిన్నమని.. బాబు షూ్యరిటీ ఇస్తే.. గ్యారంటీ లేదని.. నమ్మిన జనాన్ని మోసం చేయడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య అని పెందుర్తి నియోజకవర్గ ప్రజలు అంటున్నారు.


–పెందుర్తి/పరవాడ/సబ్బవరం/సింహాచలం

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం (బాబు సూపర్ 6)



లబ్ధి చేకూరాల్సిన మహిళలు
1,74,900 మంది

ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం (బాబు సూపర్ 6)



నియోజకవర్గంలో మొత్తం అర్హులు
29,953 మంది
వారికి ఏడాదికి అందాల్సిన మొత్తం
రూ.**59.91** కోట్లు

ప్రతి తల్లికి రూ.15 వేలు తల్లికి వందనం (బాబు సూపర్ 6)



అర్హులు
55,900
ఏడాదికి ఇవ్వాల్సిన సాయం
రూ. **83.85** కోట్లు

ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు (బాబు సూపర్ 6)



అర్హులు **58,800** మంది
ఉచిత సిలిండర్లు **1,76,400**
ఏడాదికయ్యే వ్యయం(రూ.811 చొప్పున)
రూ.**14.31** కోట్లు

ప్రతి మహిళలకు నెలకు రూ.1500 (బాబు సూపర్ 6)



అర్హులు
96,500
ఏడాదికి ఇవ్వాల్సిన సాయం
రూ. **173.70** కోట్లు

యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి (బాబు సూపర్ 6)



నిరుద్యోగులు:
58,800 మంది
నెలకు లబ్ధి రూ.**17.64** కోట్లు
ఏడాదికి లబ్ధి రూ.**211.68** కోట్లు

అన్నదాత సుఖీభవ అమలయ్యేనా?



వర్షా కాలం ముగుస్తోంది. అప్పుచేసి మరీ ఖరీఫ్ సాగు చేపట్టాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఠంచనుగా రైతు భరోసా అందజేసి అన్నదాతలను ఆదుకునేవారు. కూటమి నేతలు ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ కింద ఏటా రూ.20 వేలు ఇస్తామని ప్రకటించారు. ఇంతవరకు పథకం అమలు కాలేదు. అన్నదాత సుఖీభవ అమలవుతుందా లేదా అన్న అనుమానం కలుగుతోంది.

– కె.అప్పారావు, ఇస్సన్నపేట, పరవాడ మండలం.

ఉచిత బస్సు ఉత్తమాటే!



ఎన్నికల ముందు టీడీపీ, కూటమి నాయకులు గెలిస్తే మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన తర్వాత హామీని గాలికి వదిలేశారు. అలాంటప్పుడు హామీలు ఇవ్వడం మానుకోవాలి. అధికారం చేపట్టి మూడు నెలలు దాటినా ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదు. ఉచిత బస్సు ప్రయాణం హామీ ఎప్పటి నుంచి అమలు చేస్తారో స్పష్టత ఇవ్వాలి.

– కె.జయ, అడవివరం, సింహాచలం

గ్యాస్ సిలిండర్ల కోసం నిరీక్షణ



ఎన్నికల సమయంలో సూపర్-6 పేరుతో అర్హత ఉన్న ప్రతి ఇంటికీ ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామంటే అంతా నమ్మాం. కానీ అధికారంలోకి వచ్చి మూడు నెలలు దాటినా దానిపై ఎలాంటి ప్రకటన లేదు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు అర్హత ఉన్న ప్రతీ ఇంటికీ ఉచితంగా 3 సిలిండర్ల పథకాన్ని తక్షణమే అమలు చేయాలి.

– మందా గౌరీ లక్ష్మి, సుజాతనగర్, పెందుర్తి

తల్లికి వందనం ఎప్పుడిస్తారు?



టీడీపీ-కూటమి ఎన్నికల ప్రచారంలో తల్లికి వందనం పథకంలో రూ.15 వేలు చొప్పున ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమందికి ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ మాట ప్రకారం మాకు ఏటా రూ.30 వేలు లబ్ధి రావాలి. కానీ ఇప్పటివరకు ఆ పథకంపై ఎలాంటి స్పష్టత లేదు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నాలుగేళ్లు అమ్మ ఒడి ఇచ్చింది. పింఛన్ల వలే కూటమి ప్రభుత్వం తల్లికి వందనం ఈ ఏడాది నుంచే అమలు చేయాలి.

– నక్కెళ్ల సన్యాసమ్మ, సబ్బవరం మండలం

క్లుప్తంగా

అప్పన్నకు పౌర్ణమి తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

సింహాచలం: పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం తిరువీధి విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను విశేషంగా అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. సాయంత్రం 5 గంటల నుంచి సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటం విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మణికంఠకు పంచామృతాభిషేకాలు

పెందుర్తి: సుజాతనగర్‌లోని పూర్ణ పుష్కల సమేత ధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిపారు. పూర్ణ దేవి, పుష్కల దేవి, శాస్త, అయ్యప్పస్వామికి విశేషంగా పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం విశేషాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి ప్రసాద వితరణ జరిపారు.

సింహగిరిపై స్వచ్ఛతా హీ సేవ



ఆలయ దక్షిణ రాజగోపురం మార్గంలో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న ఉద్యోగులు

సింహాచలం: సింహగిరిపై స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మధ్యాహ్నం 3 గంటల నుంచి దేవస్థానం ఇన్‌చార్జి ఈవో సుజాత ఆధ్వర్యంలో ఉద్యోగులు కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తుల దర్శనానంతరం తిరిగి వెళ్లే ఆలయ దక్షిణ రాజగోపురం మార్గంలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు. శానిటేషన్ విభాగం ఏఈవో పిల్లా శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ ప్రసన్నలక్ష్మి, డీఈ నాగేశ్వరరావు, పీఆర్వో నాయుడు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సింహగిరిపై ఆర్జిత సేవల పునరుద్ధరణ



తలంబ్రాల ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో బుధవారం నుంచి నిత్యకల్యాణాన్ని పునరుద్ధరించారు. ఐదురోజులపాటు ఆలయంలో జరిగిన పవిత్రోత్సవాల కారణంగా నిత్యకల్యాణంతో పాటు ఆర్జిత సేవలన్నీ రద్దు చేశారు. మంగళవారంతో పవిత్రోత్సవాలు ముగియడంతో బుధవారం నుంచి ఆర్జిత సేవలన్నీ పునరుద్ధరించారు. దీనిలో భాగంగా ఉదయం 9.30 గంటల నుంచి ఆలయ కల్యాణమండపంలో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందించాశారు.

ప్రధాని మోదీ దేశానికే ఆదర్శం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ సీఎం రమేష్

పెందుర్తి: వరుసగా మూడు విడతలు ఎన్నికై, దేశాన్ని దిగ్విజయంగా పరిపాలిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ ఆదర్శనీయుడని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అన్నారు. ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పెందుర్తిలోని తాండ్ర పాపారాయుడు కల్యాణ మండపంలో బుధవారం విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలను ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అందరి కృషితో పరిసరాల పరిశుభ్రత

పరవాడ: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అరిజిల్లి దేవిరవి, మండల కోఆప్షన్ సభ్యుడు మైలపల్లి అప్పన్న, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, ప్రభుత్వ వైద్యుడు కనకఅప్పారావు, అంగన్‌వాడీ, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

సబ్బవరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వైస్ ఎంపీపీ రూాన్సీలక్ష్మీరాణి పిలుపునిచ్చారు. మండలంలోని ఆరిపాక శివారు లగిశెట్టిపాలెంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, శరగడం రాము, బి.మహలక్ష్మినాయుడు, రమేష్‌రాజు, అండిబోయిన బంగారయ్య, పాల్గుణ పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీలు

పరవాడ: క్రీడల్లో రాణించడం ద్వారా విద్యార్థులకు గుర్తింపుతోపాటు, భవిష్యత్తు బాగుంటుందని పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు అన్నారు. వాడచీపురుపల్లి జెడ్పీ హైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) మండల స్థాయి వాలీబాల్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ పోటీల్లో 13 జెడ్పీ హైస్కూళ్ల నుంచి 240 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, సర్పంచ్ శివలంక లక్ష్మి, ఎంపీటీసీ గెడ్డం పుష్పచంద్రారావు, ఉప సర్పంచ్ కె.శ్రీను, ఎంఈవోలు దివాకర్‌రావు, సాయి శైలజ, హెచ్‌ఎం పందిరి కనకేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంవీ నాగేశ్వరరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ లెక్కల సన్యాసి, అప్పారావు, పీడీలు పాల్గొన్నారు.

విజేతలు వీరే: అండర్-17 విభాగంలో వాడచీపురుపల్లి స్కూల్ విన్నర్‌గా, మెట్టపాలెం హైస్కూల్ రన్నర్‌గా, బాలికల విభాగంలో తానాం రెసిడెన్షియల్ స్కూల్ విన్నర్‌గా వాడచీపురుపల్లి రన్నర్‌గా నిలిచాయి. అండర్-14 బాలికల విభాగంలో తానాం రెసిడెన్షియల్ స్కూల్, బాలుర విభాగంలో ముత్యాలమ్మపాలెం జెడ్పీ హైస్కూల్ ప్రథమ స్థానంలో, పరవాడ జెడ్పీ హైస్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచాయి.

వికసిత్ ఏపీ కార్యాచరణ

సబ్బవరం: మండల పరిషత్ సమావేశమందిరంలో వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా ఐదేళ్ల కార్యాచరణపై వివిధ శాఖల అధికారులతో ఎంపీడీవో రమేష్‌నాయుడు బుధవారం సమీక్షించారు. రానున్న ఐదేళ్లలో వ్యవసాయం, అనుబంధ రంగాల్లో 15 శాతం వృద్ధిని సాధించే దిశగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పశువైద్యశాఖ ఏడీ డాక్టర్ ఉషాకుమారి, డీఏస్‌వో ఎం.శశికళ, ఏఎస్‌వో ఇ.కె.శ్రీలక్ష్మి, ఇన్‌చార్జ్ ఏవో సుధాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు స్వప్న, ఇందిర పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారాన్ని తీసుకుంటే బిడ్డకు మేలు

పరవాడ: గర్భిణీ దశ నుంచి అన్ని పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా పుట్టే బిడ్డ ఆరోగ్యవంతంగా జన్మిస్తాడని సీడీపీవో వి.లలితకుమారి సూచించారు. పి.బోనంగి, ఈ.బోనంగి గ్రామాల్లో బుధవారం సామూహిక సీమంతాలు, అన్న ప్రాశన కార్యక్రమాలను నిర్వహించారు. గర్భిణులు ఐరన్ అధికంగా ఉండే పోషకాహారంతోపాటు, ఐరన్ మాత్రలను తీసుకోవాలన్నారు. సర్పంచ్‌లు బండారు కల్పన, బొద్దపు శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ మేడిశెట్టి వెంకట సత్యవతి, సూపర్‌వైజర్ ఎస్.కె.షకీలా పాల్గొన్నారు.

వినయం, వివేకంతో విద్యలో రాణింపు

సబ్బవరం: వినయం, వివేకంతో కూడిన విద్యతో భవిష్యత్‌లో రాణించవచ్చని గోవాలోని అంతర్జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఆర్.వెంకటరావు అన్నారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఎల్‌ఎల్‌బీ కొత్త బ్యాచ్ విద్యార్థులకు బుధవారం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా తమ పురోగతిని సమీక్షించుకుంటూ విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య సూర్యప్రకాశరావు మాట్లాడుతూ దేశంలో మూడేళ్ల న్యాయ విద్యను ప్రారంభించిన దేశంలోని మూడే విశ్వవిద్యాలయం తమదేనన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్, మద్రాస్ అకాడమీ డైరెక్టర్ సోమా భట్టాచార్య, ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ కె.సుధ పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

- 30 కిలోల గంజాయి, ఆటో, బైక్, రెండు మొబైళ్ల స్వాధీనం



పట్టుబడిన గంజాయి, నిందితులతో డీఎస్పీ, సీఐ, పోలీస్‌లు

సబ్బవరం: ఆటోలో తరలిస్తున్న రూ.1.5 లక్షల విలువైన 30 కిలోల గంజాయిని తరలిస్తున్న ముగ్గురిని సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ కేవీ సత్యనారాయణ బుధవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. సీఐ పిన్నంటి రమణకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు ఎస్‌ఐ సింహాచలం, ఆయన సిబ్బందితో కలిసి మూడు రోడ్లు కూడలి వద్ద ఉదయం 7 గంటల సమయంలో వాహన తనిఖీలను నిర్వహించారు. ఆటోలో గంజాయిని తరలిస్తుండగా, ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై పైలట్‌గా వస్తున్నారు. దీంతో ఆటోను తనిఖీచేసి ఆటో పైభాగంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 15 ప్యాకెట్లలో 30 కిలోల గంజాయిని గుర్తించారు. ఆటో నడుపుతున్న వ్యక్తితో పాటు పక్కన ఉన్న మరో వ్యక్తిని, పైలట్‌గా వస్తున్న వారిలో ఒకరిని పట్టుకోగా, మరొకరు పరారయ్యారు. వీరి వెనుక మరో నలుగురు వ్యక్తులు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. గంజాయితోపాటు ఆటో, ద్విచక్రవాహనం, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ గంజాయిని ముంచంగిపుట్ మండలం పెద్దగూడెం నుంచి సబ్బవరం మీదగా విశాఖ తరలిస్తున్నట్లు వెల్లడించారు. పట్టుబడినవారిలో ముంచంగిపుట్ మండలంలోని గుండెమల్లిపుట్టుకు చెందిన గుడియ సురేష్(24), కొండగుడ గ్రామానికి చెందిన కిముడు మోహన్‌దాస్(21), రామపుట్ట గ్రామానికి చెందిన ముక్కి లోహిదాస్(29)ఉన్నారు. వీరిని రిమాండ్‌కు తరలించారు.

గణేష్ మండపాల వద్ద భారీ అన్నసమారాధనలు

సబ్బవరం: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక దుర్గానగర్ కాలనీలోని గణనాథుడిని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయుకులు గండి రవికుమార్, బోకం రామునాయుడు, కర్రి బాబు, కోటాన రాము, దెడ్డం ప్రసాదరావు, పాలిశెట్టి సురేష్‌రాజ్, లక్ష్మణ, కాపుశెట్టి శేషుబాబు, సబ్బవరపు నారాయణమూర్తి, వద్దాది అప్పలరాజు, యర్రంశెట్టి రాము, ధనిమిరెడ్డి శ్రీనివాస్, యడ్ల నాయుడు, ఐడీ బాబు, గవర రాజు, చిటికిరెడ్డి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీబాలగణపతి యూత్ ఆధ్వర్యంలో భర్నికం గ్రామంలో బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గ్రామ పెద్దలు గణపతిని దర్శించుకుని, పూజలు జరిపి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొండా తాతారావు, పెదిశెట్టి సత్యారావు, దాట్ల గణేష్‌రాజు, పెదిశెట్టి రామారావు, బోండా నాని, పెదిరెడ్ల శ్రీనివాసరావు, నేతల సోమేష్, ప్రగడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 96వ వార్డు పరిధిలోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, పెందుర్తి పాతూరు, దొగ్గవానిపాలెం, పార్వతీనగర్‌లలో బుధవారం అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. మాజీ కార్పొరేటర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శరగడం చినఅప్పలనాయుడు చేతుల మీదుగా ప్రారంభించిన అన్నసమారాధనల్లో దాదాపు 7 వేల మంది ప్రజలు అన్నప్రసాదాలు స్వీకరించారు.